quicktodaynews.com

RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక

తెలంగాణ

EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి | సంపుటి : 2 సంచిక : 21 | మంగళవారం 1 అక్టోబర్ 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8



మిథున్‌కు దాదాసాహెబ్

## ఫాల్కే అవార్డు

7

వాహనదారులకు

## మెట్రో యాజమాన్యం షాక్

మెట్రో పార్కింగ్‌కు ఇక ఫీజు చెల్లించాల్సిందే..

7





## ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 30(క్విక్ టుడే న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీకి బయల్దేరారు. ఇటీవల జమ్మూకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో అస్వస్థతకు గురైన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంగళవారం ఆయన పరామర్శించనున్నారు. ఆ తర్వాత దిల్లీలోని పార్టీ ముఖ్యనేతలతో సమావేశం కానున్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన తదితర అంశాలపై ప్రతిపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు ఎదురవుతున్న నేపథ్యంలో, ఈ నిర్ణయం తీసుకోవడం వెనక ఉన్న కారణాలను ఆయన అధిష్ఠానానికి వివరించే అవకాశముంది.

## కంటతడి పెట్టిన మంత్రి కొండా సురేఖ

ట్రోలింగ్ పట్ల భావోద్వేగానికి గురైన మంత్రి

కేటీఆర్ బట్టలు ఊడదీసి పరిగెత్తిస్తామని ఘాటు వ్యాఖ్యలు



7

# యజమానులకు టైమ్ ఇవ్వరా?

### హైడ్రా ఏర్పాటు అభినందనీయం.. పనితీరే అభ్యంతరకరం



- శని,ఆదివారాల్లోనే కూల్చివేతల మతలబు ఏంటి?
- కూల్చివేతలకు ముందు ఓనర్లకు సమయం ఇవ్వరా?
- సూర్యాస్తమయం తర్వాత ఎందుకు కూల్చివేతలు చేపడుతున్నారు?
- చట్టప్రకారం నడుచుకోకపోతే హైడ్రాపైనే స్టే విధిస్తాం?
- హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ఆగ్రహం
- హైడ్రా కమిషనర్, అమీన్‌పూర్ తహసీల్దార్‌పై విచారణ
- వచ్చేనెల 15 వరకు విచారణ వాయిదా

**హైదరాబాద్, సెప్టెంబర్ 30(క్విక్ టుడే న్యూస్):** హైడ్రా తీరుపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో కూల్చివేతలపై పలువురు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై సోమవారం విచారణ జరిగింది. విచారణకు హైడ్రా కమిషనర్ రంగానథ్ వర్చువల్‌గా, అమీన్‌పూర్ తహసీల్దార్ కోర్టులో హాజరై వివరణ ఇచ్చారు. శని, ఆదివారాలు, సూర్యాస్తమయం తర్వాత ఎందుకు కూల్చివేతలు చేపడుతున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదివారం మీరు ఎందుకు పని చేయాలని ప్రశ్నించింది. సెలవుల్లో ఎందుకు నోటీసులు ఇచ్చి, అత్యవసరంగా కూల్చివేస్తున్నారని అడిగింది. శని, ఆదివారాల్లో కూల్చివేయొద్దని గతంలో కోర్టు తీర్పులున్నాయని గుర్తు చేసింది. కోర్టు తీర్పుల విషయం కూడా తెలియదా అని తహసీల్దార్‌ను ప్రశ్నించింది. గతంలో మీరు కూల్చివేసిన కేసుపై స్టే విధించిన విషయం తెలియదా? అని అడిగింది. చట్టప్రకారం నడుచుకోకపోతే

మిగతా 2లో..



## అక్టోబర్ 9న కొత్త పంతుళ్లు

- ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు
- 55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు ఇచ్చాం
- డీఎస్సీ రిజల్ట్స్ విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 30(క్విక్ టుడే న్యూస్):** అక్టోబర్ 9వ తేదీన ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ నియామక పత్రాలు అందజేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉదయం సచివాలయంలో డీఎస్సీ పరీక్షల ఫలితాలను సిఎం రేవంత్ విడుదల చేసారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేవలం 55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు ఇచ్చామని తెలిపారు. 1:3 నిష్పత్తిలో వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు. అక్టోబర్

మిగతా 2లో..

## మూసీ ప్రక్షాళన పెద్ద కుంభకోణం

- లక్షన్నర కోట్లు పెట్టి ఏం సాధిస్తారు?
- ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని.. ఇప్పుడు ఉన్న ఇండ్లను కూలుస్తారా?
- మూసీలో పట్టాలు ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ
- నమామి గంగ ప్రాజెక్టుకే 40వేల కోట్లు..
- సీఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కేటీఆర్

7



## 6వేల ప్రత్యేక బస్సులు

### దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ సర్వీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 30(క్విక్ టుడే న్యూస్):** దసరా పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 6,000 ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనుంది. ఈ ప్రత్యేక బస్సులు ప్రస్తుత ప్రయాణికుల అవసరాలను తీర్చేందుకు, వివిధ ప్రాంతాలకు మరింత సౌకర్యంగా ప్రయాణం చేసేందుకు

మిగతా 2లో..





## 3నుంచి డిజిటల్ కార్డులపై క్షేత్రస్థాయి పరిశీలన

### అధికారులలో మరోమారు సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబర్ 30(క్విక్ టుడే న్యూస్):** కుటుంబ డిజిటల్ కార్డుల పంపిణీ సమయంలో కుటుంబ సభ్యులు అంగీకరిస్తేనే కుటుంబం ఫొటో తీయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం గుర్తించిన కుటుంబాన్ని నిర్ధరించాలన్నారు. కుటుంబ డిజిటల్

మిగతా 2లో..



## అందరికీ రుణమాఫీ చేయాల్సిందే

- ఇచ్చిన హామీలు మరచిన కాంగ్రెస్
- రుణామఫీపై రైతులను మోసం చేసిన ప్రభుత్వం
- ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో బీజేపీ నేతల 24 గంటల నిరసన దీక్ష

**హైదరాబాద్, సెప్టెంబర్ 30(క్విక్ టుడే న్యూస్):** ఇచ్చిన హామీలు మరిచావా? మరిచిపోయినట్లు నటిస్తున్నావా'.. అంటూ భాజపా శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి.. సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్

మిగతా 2లో..

## నిర్మలాసీతారామన్‌కు ఊరట

### ఎన్నికల బాండ్ల కేసుపై హైకోర్టు స్టే



**బెంగళూరు, సెప్టెంబర్ 30:** ఎన్నికల బాండ్ల కొనుగోలు చేయాలంటూ బెదిరింపుల కేసులో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు పలువురు బీజేపీ అగ్రనేతలకు సోమవారం కర్ణాటక హైకోర్టు భారీ ఊరట నిచ్చింది. ఈ కేసు విచారణను నిలిపివేస్తూ.. హైకోర్టు సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ

మిగతా 2లో..

# మూసీ సుందరీకరణకు హైడ్రాకు సంబంధం లేదు

- మూసీలో మార్కింగ్ కూడా మేం చేపట్టడం లేదు
- ఇదంతా మూసీ రివర్ ఫ్రంట్ కార్యక్రమం : రంగనాథ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 30(క్విక్ టుడే న్యూస్):** మూసీ సుందరీకరణపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. నదికి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదన్నారు. మూసీ నది పరిధిలో నివసిస్తున్న వారిని హైడ్రా తరలించడం లేదని, నదిలో ఎలాంటి కూల్చివేతలు చేపట్టడం లేదన్నారు. నదీ పరివాహక ప్రాంతంలోని ఇళ్లపై



హైడ్రా మార్కింగ్ చేయడం లేదని, మూసీ సుందరీకరణ అనేది ప్రత్యేక ప్రాజెక్టని చెప్పారు. దానిని మూసీ


మిగతా 2లో..

## ఆప్ నేతలకు సుప్రీంలో స్టే

### క్రిమినల్ పరువునష్టం కేసులో ఊరట

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:** క్రిమినల్ పరువునష్టం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు సుప్రీంకోర్టులో సోమవారం ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి దిగువ కోర్టులో విచారణపై అత్యున్నత

మిగతా 2లో..



## పేద దళిత విద్యార్థికి సుప్రీం కోర్టు బాసట

### ధన్‌బాద్ ఐఐటీ సీటు ఇవ్వాలని ఆదేశం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:** పేద దళిత విద్యార్థికి సుప్రీం కోర్టు బాసటగా నిలిచింది. ఐఐటీ ధన్‌బాద్‌లో సీటు సాధించినా గడువులోగా రూ.17,500 ఫీజు కట్టలేక సీటు కోల్పోయిన విద్యార్థికి అడ్మిషన్ కల్పించాలని ఐఐటీ ధన్‌బాద్‌కు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఫీజు చెల్లించకుండా గత మూడు నెలలుగా ఏమి చేస్తున్నారని విద్యార్థి

మిగతా 2లో..

## ముడా కేసులో ఈడీ చర్యలు

### సిద్ధరామయ్యపై కేసు నమోదు



**బెంగళూరు, సెప్టెంబర్ 30:** కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమవారం చర్యలు చేపట్టింది. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూ కుంభకోణం ఆరోపణలపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. సీఎం సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామి, ఆయనకు భూమిని అమ్మిన దేవరాజుపై సెప్టెంబర్ 27న మైసూరు లోకాయుక్త నమోదు చేసిన

మిగతా 2లో..

## మెట్రో ఆఫర్ గడువు మార్చి వరకు పొడిగింపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 30(క్విక్ టుడే న్యూస్):** ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైలు గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రయాణికులకు అందిస్తున్న ఆఫర్లను పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 2025 మార్చి 31 వరకు ఆఫర్లను

మిగతా 2లో..

RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

QUICK TODAY

మంగళవారం 1 అక్టోబర్ 2024

quicktodaynews.com



మొదటి పేజీ తరువాయి..

# యజమానులకు టైమ్ ఇవ్వరా?

ఇబ్బందులు పడాల్సి వస్తుందని తహసీల్దార్‌ను హెచ్చరించింది. రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు చెప్పినంత మాత్రాన అక్రమంగా ముందుకు వెళ్లొద్దు. ఇల్లు కూల్చే ముందు యజమానికి చివరి అవకాశం ఏమైనా ఇచ్చారా? ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో అమాయకులను ఇబ్బందులకు గురి చేస్తారా? అని ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. కోర్టు అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సూచించింది. కూల్చివేతకు యంత్రాలు, సిబ్బందిని కోరడంతో సమకూర్చామని బదులివ్వగా.. చార్మినార్ కూల్చివేతకు తహసీల్దార్ యంత్రాలు, సిబ్బంది అడిగితే ఇస్తారా? అని హైకోర్టు ప్రశ్నించింది. హైడ్రా ఇదే విధంగా ముందుకు వెళ్తే స్టే ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. ఖాళీ చేయనంత మాత్రాన అత్యవసరంగా కూల్చాల్సిన అవసరం ఏముంది?పొలిటికల్ బాస్‌లను సంతృప్తిపరిచేందుకు, పై అధికారులను మెప్పించేందుకు చట్టవిరుద్ధంగా పని చేయొద్దు. చనిపోయే వ్యక్తిని కూడా చివరి కోరిక అడుగుతారు కదా? ఆదివారం కూల్చివేతలు హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా? అధికారులు చట్టవ్యతిరేకంగా పనిచేస్తే ఇంటికెళ్తారు.. జాగ్రత్త అంటూ హెచ్చరించింది. మూసీపై కూడా 20 లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయి. ఇది అరుదైన కేసుగా భావించే అధికారులను విచారణకు పిలిచాం. జీవో ప్రకారం హైడ్రాకు ఎన్నో విధులు ఉన్నాయి. మిగతావి పట్టించుకోకుండా కూల్చివేతలపైనే దృష్టి పెట్టారు. ట్రాఫిక్ సమస్యపైనా హైడ్రాకు బాధ్యత ఉంది. కానీ దాని గురించి ఏమాత్రం పట్టించుకోవట్లేదు. మాదాపూర్‌లో ప్రయాణం ఎంత సమయం పడుతుందో తెలుసు కదా? నిబంధనలు పాటించకుంటే హైడ్రా ఏర్పాటు జీవోపై స్టే ఇవ్వాల్సి వస్తుంది. సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేస్తేనే సామాన్యులు ఇళ్లు నిర్మిస్తున్నారు. స్థానిక సంస్థ అనుమతి ఇస్తేనే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో సామాన్యులు నష్టపోవాల్సి వస్తోంది. ఆదివారం కూల్చివేతలు వద్దని త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఉంది. అక్రమ నిర్మాణాలు అనిపిస్తే సీజ్ చేయవచ్చు కదా? హైడ్రా ఏర్పాటు అభినందనీయం.. పనితీరే అభ్యంతరకరం. అమీన్‌పూర్ తహసీల్దార్, హైడ్రా కమిషనర్ తీరు అసంతృప్తికరం. ఒక్కరోజులో హైదరాబాద్‌ను మార్చాలనుకోవడం సరికాదు. ఎఫ్టీఎల్ నిర్ధరించకుండా అక్రమాలు అని ఎలా తేలుస్తారని హైకోర్టు ప్రశ్నించింది. విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేసింది. అప్పటివరకు యథాతథ స్థితి కొనసాగించాలని హైడ్రా, అమీన్‌పూర్ తహసీల్దార్‌ను ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయాలని చెప్పింది. ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తారా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కూల్చివేతలు హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు న్యాయమూర్తి ప్రశ్నించారు. అమీన్‌పూర్‌పైనే మాట్లాడాలని, కావూరిహిల్స్ గురించి అడగలేదంటూ కోర్టు అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలని.. జంప్ చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో విజ్ఞప్తి మేరకు చర్యలు తీసుకున్నామన్నా రంగనాథ్ వివరణపై అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మార్వో అడిగితే గుడ్డిగా చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించారు. ఎమ్మార్వో అడిగితే చార్మినార్, హైకోర్టును కూడా కూల్చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాకు ఇదే విధంగా ముందుకు వెళ్తే స్టే ఇవ్వాల్సి వస్తుందన్నారు. కూల్చివేతలు తప్ప వేరే పాలసి లేదని, ఇది ప్రజల అభిప్రాయమన్నారు. ఈ సందర్భంగా కోర్టులను ఎంతో గౌరవిస్తున్నామని న్యాయమూర్తికి రంగనాథ్ తెలిపారు. మూసీపై కూడా 20 లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయని న్యాయమూర్తి వెల్లడించారు. ప్రభుత్వ వ్యవస్థల మధ్య సమన్వయం లేదని చెప్పారు. ఇది అరుదైన కేసుగా భావించే అధికారులను విచారణకు పిలిచామన్నారు.

అక్రమ నిర్మాణాలు అనిపిస్తే సీజ్ చేయవచ్చు కదా అన్నారు. హైడ్రా ఏర్పాటు అభినందనీయమేనని, పనితీరే అభ్యంతరకమన్నారు. అమీన్‌పూర్ ఎమ్మార్వో, హైడ్రా కమిషనర్ తీరు అసంతృప్తికమరని చెప్పారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారించకుండా అక్రమాలు అని ఎలా తేలుస్తారన్నారు. ఒక్కరోజులో హైదరాబాద్‌ను మార్చాలనుకోవడం సరికాదన్నారు.

# అందరికీ రుణమాఫీ చేయాల్సిందే




అధికారంలో వచ్చాక 1000 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. రైతు హామీల సాధన కోసం భాజపా ప్రజా ప్రతినిధులు ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద 24 గంటల దీక్ష చేపట్టారు. రేపు ఉదయం పదకొండు గంటల వరకు జరిగే ఈ దీక్షను ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. అన్నదాతలను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, గోడెం నగేష్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, పాల్వాయి హరీశ్‌బాబు దీక్షలో కూర్చున్నారు. ఈసందర్భంగా ఏలేటి మాట్లాడుతూ రైతులు ఓట్లేస్తే కాంగ్రెస్ గెలిచిందని గుర్తు చేశారు. రుణమాఫీ పూర్తిగా సాధ్యం కాదని తెలిసి కూడా కాంగ్రెస్ నేతలు హామీలు ఇచ్చారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఆరు గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తి చేసే సత్తా కాంగ్రెస్‌కు లేదని గతంలోనే చెప్పానని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మాత్రమే పూర్తిగా అమలు చేశారన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి అప్పట్లో కేసీఆర్ కూడా పూర్తి చేయలేదు. నిరుద్యోగులకు నిరుద్యోగభృతి హామీని కూడా ఆయన నెరవేర్చలేదు. రూ.లక్ష రుణమాఫీకి రూ.24 వేల కోట్లు అవసరమైతే.. కేవలం రూ.14 వేల కోట్లు ఇచ్చారు. అని ఈటల అన్నారు.

# 6వేల ప్రత్యేక బస్సులు

సర్వసాధారణ మైన మార్గాల్లో నడుపుతారు. ప్రయాణికులు ఆన్‌లైన్ లేదా బస్సు స్టేషన్‌ల ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు. ఈ ప్రత్యేక సేవలు దసరా సమయంలో అనేక మందికి ప్రయోజనకరంగా ఉంటాయి, తద్వారా వారు ఈ పండుగను సుఖంగా జరుపుకోగలుగుతారు. అయితే.. హైదరాబాద్ శివారు నుంచి దసరాకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరుకు సర్వీసులు అందుబాటులో ఉంచనున్నట్లు ఆయన తెలిపారు. కరీంనగర్, నిజామాబాద్ మార్గాల్లో ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉండనున్నట్లు సజ్జనార్ వెల్లడించారు. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని సజ్జనార్ పేర్కొన్నారు.

# ఆప్ నేతలకు సుప్రీంలో స్టే

న్యాయస్థానం స్టే ఇచ్చింది. ఢిల్లీ ఓటర్ల జాబితా నుంచి పలువురి పేర్లను తొలగించారంటూ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఈ ఇరువురిపై పరువునష్టం కేసు దాఖలైంది. దీనిపై సమాధానం ఇవ్వాల్సిందిగా ఢిల్లీ పోలీసులకు, ఫిర్యాదుదారు, బీజేపీ నేత రాజీవ్ బబ్బర్‌కు జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. అనంతరం దిగువ కోర్టు విచారణపై స్టే ఇచ్చింది. అతిషి, కేజ్రీవాల్‌తో పాటు ఆప్ నేతలు సుశీల్ కుమార్ గుప్తా, మనోజ్ కుమార్‌పై బబ్బర్ క్రిమినల్ పరువునష్టం దావా వేశారు. బీజేపీ ఆదేశాలతో వివిధ వర్గాలకు చెందిన 30 లక్షల మంది ఓటర్ల పేర్లను ఢిల్లీ ఓటర్ల జాబితా నుంచి తొలగించారంటూ 2018 డిసెంబర్‌లో జరిగిన మీడియో సమావేశంలో ఆప్ నేతలు ఆరోపించారని, ఇందువల్ల తమ పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిందని బబ్బర్ కోర్టుకు నివేదించారు. 2019 మార్చిలో కేజ్రీవాల్, ఇతరులకు మెజిస్ట్రేట్ సమన్లు జారీ చేయగా, దీనిపై సెషన్స్ కోర్టును ఆప్ నేతలు ఆశ్రయించారు. అయితే సెన్షన్ కోర్టు వీరి వాదనను తోసిపుచ్చింది. అనంతరం హైకోర్టును ఆప్ నేతలు ఆశ్రయించగా క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కోర్టు సమర్ధించింది. దీంతో అతిషి, కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# నిర్మలాసీతారామన్‌కు ఊరట

చేసింది. ఎన్నికల బాండ్ల కొనుగోలు చేసేందుకు బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, పలువురు బీజేపీ అగ్రనేతలతోపాటు ఈడీ ఉన్నతాధికారులపై బెంగళూరులోని తిలక్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయాలని ప్రత్యేక కోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తిలక్ నగర్ పీఎస్‌లో వీరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసేందుకు వివిధ సంస్థలను బెదిరించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, బీజేపీ అగ్రనేతలు, పలువురు ఈడీ ఉన్నతాధికారులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో వారిపై జ్ఞానధికార్ సంఘర్ష పరిషత్ సంస్థ సహ అధ్యక్షుడు అదర్ష్ అయ్యార్ తిలక్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఫిర్యాదును స్వీకరించేందుకు ఆ స్టేషన్ పరిధిలోని పోలీసులు అభ్యంతరం తెలిపారు. దాంతో గతేడాది ఏప్రిల్‌లో చట్టసభ ప్రతినిధుల కోర్టును ఆయన ఆశ్రయించి.. పిటిషన్ దాఖలు చేశారు. దాంతో ఈ కేసు విచారణ నిలిపి వేసేలా ఆదేశాలు జారీ చేయాలంటూ బీజేపీ కీలక నేతలు కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. దాంతో సోమవారం హైకోర్టు ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. ఎన్నికల బాండ్ల బెదిరింపుల కేసులో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ఈడీ ఉన్నతాధికారులు, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కర్ణాటక బీజేపీ అగ్రనేతలు నళిని కుమార్ కటీల్, విజయేంద్రలకు వ్యతిరేకంగా పోలీసులకు అదర్ష్ అయ్యార్ ఫిర్యాదు చేసిన విషయం విదితమే.

## పేద దళిత విద్యార్థికి
# సుప్రీం కోర్టు బాసట

తరపు న్యాయవాదులను ప్రశ్నించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లా టిటోరా గ్రామానికి చెందిన అతుల్‌కుమార్ రెండో, చివరి అవకాశంలో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ చాటి ఐఐటీ ధన్‌బాద్‌లో సీటు సాధించాడు. సీటు ఖరారు చేసేందుకు జూన్ 24 లోపు రూ.17,500 ఫీజు కట్టాల్సి ఉండగా, దినసరి కూలీలైన అతడి తల్లిదండ్రులు గడువులోగా ఫీజు కట్టలేక పోయారు. దీంతో వారి నిస్సహాయతను చూసిన టిటోడా గ్రామస్థులు విరాళాలు వేసుకొని ఆ మొత్తం సమకూర్చారు. ఈలోగా ఫీజు గడువు ముంచుకువచ్చింది. దీంతో చివరిరోజుల్లో సాంకేతిక కారణాలతో ధన్‌బాద్ ఐఐటీ ఆన్‌లైన్ పోర్టల్ పనిచేయక అతుల్ ఆ మొత్తాన్ని సకాలంలో కట్టలేకపోయాడు. సీటు వచ్చినట్టే వచ్చి చేజారింది. సాయం కోసం విద్యార్థి జాతీయ ఎస్సీ కమిషన్‌ను, జేఈఈ పరీక్ష ఝార్ఖండ్‌లో రాసినందున అక్కడి లీగల్ సర్వీసెస్ అథారిటీని ఆశ్రయించాడు. జాతీయ ఎస్సీ కమిషన్ చేతులెత్తేయగా ఝార్ఖండ్ లీగల్ సర్వీస్ అథారిటీ ఈ ఏడాది ఐఐటీ మద్రాస్ ఈ పరీక్ష నిర్వహించినందువల్ల మద్రాస్ హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. మద్రాస్ హైకోర్టు దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని కోరింది. దీంతో వారు సుప్రీంను ఆశ్రయించగా వాదనలు విన్న న్యాయస్థానం విద్యార్థికి అడ్మిషన్ కల్పించాలని ఐఐటీ ధన్‌బాద్‌ను ఆదేశించింది.

## మెట్రో ఆఫర్ గడువు
# మార్చి వరకు పొడిగింపు

పొడిగించినట్లు సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం అందిస్తున్న సూపర్ సేవర్-59, స్టూడెంట్ పాస్, సూపర్ సేవర్ ఆఫ్ పీక్ ఆఫర్లను పొడిగించింది. అక్టోబర్ 6 నుంచి నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్లలో నామమాత్రపు పార్కింగ్ ఫీజు వసూలు చేయనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల సౌలభ్యం, భద్రత కోసమే ఈ రుసుము వసూలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు మెట్రో ఎండీ కేవీబీ రెడ్డి తెలిపారు.

# అక్టోబర్ 9న కొత్త పంతుళ్లు

9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు ఇస్తామని ప్రకటించారు. పదేళ్లలో గత ప్రభుత్వం ఒకే ఒక్క డీఎస్సీ ఇచ్చిందని విమర్శించారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని, త్వరలోనే గ్రూప్ 1




పరీక్షలు నిర్వహించి ఫలితాలు ఇస్తామని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. డీఎస్సీ 2024 ఫలితాలను విడుదల చేసిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరో గుడ్ న్యూస్ చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పరిస్థితులు ఖాళీలు చూసుకొని డీఎస్సీపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఉద్యోగ నియామక పక్రియ అనేది నిరంతరం సాగేదని అన్నారు. ఇప్పుడు డీఎస్సీ పక్రియ నియామక పక్రియ పూర్తి అయిన తర్వాత ఇందులో ఉన్న మిగిలిపోయే ఖాళీలు, కొత్తగా ఏర్పడే ఖాళీలు తెప్పించు కొని డీఎస్సీపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కచ్చితంగా ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకారమే ఉద్యోగాలు నియామకాలు జరుగుతాయన్నారు. ప్రభుత్వంలో ఉన్న ఏ ఉద్యోగం కూడా ఖాళీ లేకుండా భర్తీ చేస్తామని అన్నారు. త్వరలోనే గ్రూప్ 1 రిజల్ట్స్ కూడా ఇస్తామన్నారు. గత ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసింది కానీ అక్కడ కనీస వసతులు కల్పించడంలో పూర్తి ఫెయిల్ అయిందన్నారు. పిట్టగూళ్లలో, పౌల్ట్రీ ఫామ్‌లో పేదల పిల్లలను వదిలేశారని ఆరోపించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయబోతున్నామని రేవంత్ ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికి ఇరవై నుంచి ఇరవై ఐదు ఎకరాలల్లో ఈ విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ మైనార్టీ విద్యార్థులను ఒకే చోట విద్యను అందించబోతున్నామని తెలిపారు. యూనివర్శిటీ స్థాయిలో ఈ రెసిడెన్సియల్ స్కూల్స్ ఉంటాయని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద ముందుగా కొడంగల్, మధిరలో ఏర్పాటు చేస్తున్నామని ఇప్పటికే పనులు కూడా ప్రారంభమైనట్టు పేర్కొన్నారు. టెట్ తర్వాతనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. త్వరలోనే గ్రూప్ వన్ ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించారు. విద్యాశాఖ అధికారులు అతి తక్కువ సమయంలో ఉద్యోగాల భర్తీకి కృషి చేశారని అన్నారు. వారికి అభినందనలు తెలిపారు. 26అప్షన్ కింద డీఎస్సీ నిర్వహించామని వివరించారు. 1:3ప్రాతిపాదికన ఫలితాల ప్రకటించిన తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. దసరా లోపే 9అక్టోబర్ నాడు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకే ఒక్క నోటిఫికేషన్ వేసిందని మండిపడ్డారు.మాజీ సీఎం కేసీఆర్ కేవలం 7, 857 టీచర్లను మాత్రమే నియమించారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరి వల్ల పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య మీద పెట్టేది ఖర్చు కాదని తెలిపారు. పది నెలల్లోనే 11062 టీచర్ల భర్తీకి తాము కృషి చేశామని అన్నారు. ఇది తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని తెలిపారు.తమ ప్రభుత్వం వచ్చిన అనతికాలంలోనే 30వేల ఉద్యోగ పత్రాలు అందజేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతుందని హామీ ఇచ్చారు. గురుకులాల గురించి కేసీఆర్ చెప్పారని..కానీ మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. వంద నియోజక వర్గాల్లో యంగ్ ఇండియా ఇంటి గ్రెటెడ్ స్కూల్స్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ టీచర్ల పదోన్నతులు, బదిలీలు ఎందుకు చేయలేదని నిలదీశారు. దీని వల్ల టీచర్లలో నిరాశ ఏర్పడిందని చెప్పారు. 36వేల మంది టీచర్ల బదిలీలను ఎలాంటి విమర్శలు లేకుండా తాము పూర్తి చేశామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోలేదని.. దాని వల్ల కొంత సమస్యలు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

## 3నుంచి డిజిటల్ కార్డులపై
# క్షేత్రస్థాయి పరిశీలన

కార్డులపై సోమవారం సీఎం సమీక్ష నిర్వహించారు. డిజిటల్ కార్డుల కోసం సేకరించే వివరాలను అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అక్టోబరు 3 నుంచి 7 వరకు పైలట్ ప్రాజెక్టులో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాలు, 238 ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలి. కొత్త సభ్యులకు జత చేసి, చనిపోయిన వారిని తొలగించాలి. పైలెట్ ప్రాజెక్టులో ఎదురైన వివరాలతో నివేదిక తయారు చేయాలి. కుటుంబ సభ్యుల వివరాల మార్పులు చేర్పుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేక, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## మూసీ సుందరీకరణకు
# హైడ్రాకు సంబంధం లేదు

రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని వెల్లడించారు. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో ఇటీవల జరుగుతున్న కొన్ని ఆందోళనలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరణ ఇచ్చారు. నదీ పరివాహక ప్రాంతంలో నివాసితుల భద్రత, పునరావాసం, కూల్చివేతలకు సంబంధించిన వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో, కమిషనర్ కొన్ని ముఖ్యమైన వివరాలను వెల్లడించారు. మూసీ నదికి ఇరువైపులా జరుగుతున్న సర్వేలు హైడ్రాకు సంబంధించినవి కాదని స్పష్టంగా అవగాహన చేయాలని కోరారు. ఈ సర్వేలు హైడ్రా చట్టం లేదా ప్రాజెక్టుకు సంబంధించినవి కాదని తెలిపారు. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను హైడ్రా తరలించడం లేదని ఆయన స్పష్టం చేశారు. నివాసితులపై జరుగుతున్న ఇబ్బందులు తప్పనిసరిగా నివారించబడాలని హైడ్రా సంస్థ భావిస్తోందన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఎలాంటి ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని ఆయన తెలిపారు. ఇది నివాసితుల కష్టాలను, అసౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని చేయబడిన నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్నదని, ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంతాన్ని అందంగా మార్చడం, పర్యావరణ సురక్షణపై దృష్టి సారించడం ద్వారా స్థానిక ప్రజలకు ప్రయోజనాలు అందించడం లక్ష్యంగా ఉందన్నారు. ఈ ప్రకటనలు, వాస్తవాలను స్పష్టం చేసేందుకు, ప్రజల భద్రతా ఆశలపై హైడ్రా సంస్థ కట్టుబడినట్టు తెలియజేయడానికి ఒక ప్రయత్నమన్నారు. ప్రజలు భద్రత కోసం కృషి చేయాలని, వాటిని మరింత నిశ్చితంగా, సహాయకరంగా చూడాలని కమిషనర్ కోరారు. ప్రజల, హైడ్రా సంస్థ మధ్య అనుబంధాన్ని మెరుగుపరచడం, స్థానిక అభివృద్ధికి దోహదం చేయడం ఎంతో ముఖ్యమన్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని.. ఆయన సూచించారు.

## కాంగ్రెస్ రైతులను
# నమ్మించి మోసం చేసింది

**హామీలు ఇచ్చి గద్దెనెక్కాక వాటిని మరచి పోయారు**

**ఇందిరాపార్క్ వద్ద దీక్షలో ఎంపీ అర్వింద్ విమర్శలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 30(క్విక్ టుడే న్యూస్):** కాంగ్రెస్ రైతులను నమ్మించి మోసం చేసిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ విమర్శించారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కాక ఇప్పుడు వాటిని మరచి పోయారని అన్నారు. ఏలేటి మహేశ్వర్ రెడ్డి బీజేఎల్పీ నేత అయినప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందిన ఎన్నో స్కాములు, అవినీతిని బట్టబయలు చేశారని అన్నారు. కాంగ్రెస్‌కు హైదరాబాద్‌లో సీట్లు రాలేదు.. ఆ పార్టీ ఎమ్మెల్యేలకు గ్రామీణ ప్రాంతాల్లో ఓట్లు వచ్చాయని చెప్పారు. సోమవారం ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రైతు దీక్ష జరిగింది. ఈ దీక్షలో ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అందుకే ఇక్కడ పేదల ఇళ్లను కూలుస్తు న్నారని విమర్శించారు. తొమ్మిదేళ్లు తెలంగాణలో ప్రజా కంటగింపు పాలనను చూశామన్నారు. కేసీఆర్ ఇక అధికారంలోకి రాడని.. నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఇళ్లను కూలుస్తున్నారని మండిపడ్డారు. ముస్లింలను ఒకలా.. హిందువులను మరోలా చూస్తున్నారని ధ్వజమెత్తారు. హిందువుల ఇళ్లను మాత్రమే హైడ్రా కూలుస్తుందని ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వంలో రైతు రుణమాఫీలేదు.. రైతు భరోసా లేదు.. బోనస్ ముచ్చటే లేదని మండిపడ్డారు. ప్రమాదవశాత్తు పంట నష్టం జరిగితే ఆదుకునే నాథుడే లేరని ఎంపీ అరవింద్ అన్నారు. కేసీఆర్.. ఒక ఎకరాకు కోటి సంపాదిస్తున్నాడట.. కోటి సంపాదన ఎలా సాధ్యమో తెలుసుకునేందుకు ప్రభుత్వం నుంచి ఒక టీమ్‌ను ఆయన ఫాంహౌస్‌కు కూడా పంపాలని కోరారు. పరిశీలించడానికి రేవంత్ టీంను ఏర్పాటు చేయాలని కోరారు. రైతులకు గైడ్ చేయాలని సూచించారు. కేసీఆర్ దిగిపోయాక ఆయన మాటలను చాలా మిస్ అవుతున్నానని అన్నారు. ఉద్యమ సమయంలో ఆయన పులిలా ఉన్నారు.. ఇప్పుడు పిల్లి లాగా అయ్యారని ఎంపీ అరవింద్ విమర్శలు చేశారు. కేసీఆర్.. తెలంగాణను నట్టేటా ముంచారని ఎంపీ అరవింద్గ ÷ర్ అయ్యారు. ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే దారిలో పోతోందని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు అగ్రికల్చర్ పాలసీ ఎందుకు తీసుకురాలేదని ఎంపీ అరవింద్ ప్రశ్నించారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు అల్లం, పసుపుకు తేడా తెలియదని.. ఆయన కూడా ఈరోజు మాట్లాడుతున్నారని ఎంపీ అరవింద్ ఎద్దేవా చేశారు. కేసీఆర్‌లాగే వరి మాత్రమే వేసుకునే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. రేవంత్ ప్రభుత్వంలో రైతు భరోసా కాదు.. బీమా కూడా అందట్లేదని ఎంపీ అరవింద్ ఆరోపించారు. మాజీ ప్రధాని ఇందిరమ్మను కూడా ప్రశాంతంగా ఉండనివ్వ కుండా ఇంకా బదనాం చేస్తున్నారని అన్నారు. ప్రతి మండలానికి ఇంటర్నేషనల్ స్కూళ్లను ప్రారంభిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని గుర్తుచేశారు.

RNI NO : TELTEL/2023/86487
క్విక్ టుడే
QUICK TODAY
మంగళవారం 1 అక్టోబర్ 2024
quicktodaynews.com


## దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా బీఆర్ఎస్ నేతలు

### మండిపడ్డ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (క్విక్ టుడే న్యూస్):** భారాస నేతల మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు అన్యాయం చేస్తున్నామని దుమ్మెత్తి పోస్తున్న భారాస నేతలు.. అప్పట్లో రైతులకు బేడీలు వేసి తీసుకెళ్లలేదా? అని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ...కానీ కాంగ్రెస్ అలా చేయడం లేదన్నారు. మూసీ పరివాహకంలో ఏ ఒక్క పేదకు అన్యాయం జరగదని అన్నారు. అన్ని పార్టీల ఎన్నికల అజెండాలో మూసీ ప్రక్షాళన ఉంది. మూసీ పరివాహకంలో ఇప్పటివరకు ఒక్క పేదవాడి ఇల్లు కూడా కూల్చలేదు. నది పక్కనున్న వ్యర్థాలను మాత్రమే తొలగించాం. దేశంలోనే అత్యంత కలుషితమైన నదిగా మూసీ నదికి పేరుంది. గడిచిన పదేళ్లలో 1500 చెరువులు కబ్జాకు గురయ్యాయి. ఎక్కువశాతం చెరువులను భారాస నేతలే కబ్జా చేశారు. అరగంట వాన పడితే హైదరాబాద్ పరిస్థితి దారుణంగా తయారవుతోంది. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం నల్ల చట్టాలు తీసుకొచ్చి ఎంత మంది రైతులను పొట్టన పెట్టుకుందో అందరికీ తెలుసని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అలాంటి బిజెపి నేతలు రైతుల గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వారికి రైతుల గురించి ఏం తెలుసున్నారు. ఇంతకన్నా దారుణం లేదన్నారు.

### పట్టభద్ర ఓటర్ల నమోదుకు

## ఈసీ నోటిఫికేషన్

**అమరావతి, సెప్టెంబర్ 30 (క్విక్ టుడే న్యూస్):** ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజవర్గ పరిధిలో ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. అక్టోబరు 1 నుంచి నవంబరు 6 వరకు ఈ జిల్లాల పరిధిలో పట్టభద్రులైన ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఫాం-18 ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఈసీ సూచించింది. నవంబర్ 23న ఓటర్ల జాబితా ముసాయిదాను ప్రకటించనున్నారు. డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలను స్వీకరించి.. అదే నెల 30న తుది జాబితాను వెల్లడించనున్నారు. ఇప్పటికే ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదుకే ఈసీ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

## ఎన్నాళ్లు కొట్లాడినా.. లాయర్లకే లాభం

### మీరు విడాకులు తీసుకుని ఉద్యోగం చేయండి

### ఉన్నత విద్యావంతురాలైన మహిళకు సీజేఐ సూచన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:** వైవాహిక బంధంలో వివాదాలకు సంబంధించిన ఓ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారంలో సుదీర్ఘ న్యాయపోరాటం వల్ల అది న్యాయవాదులకే ప్రయోజనంగా మారుతుందని అన్నారు. అందువల్ల పరస్పర సమ్మతితో విడాకులకు అంగీకరించాలని ఆ దంపతులకు సూచించారు. తమ జంట మధ్య వివాదానికి సంబంధించిన కేసును మరో కోర్టుకు బదిలీ చేయాలంటూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈసందర్భంగా సదరు మహిళ విద్యార్హతలను చీఫ్ జస్టిస్ అడిగారు. తాను ఎంటెక్ పూర్తిచేసి, అమెరికా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు ఆమె సమాధానమిచ్చారు. అయితే, ప్రస్తుతానికి తానేమీ ఉద్యోగం చేయట్లేదని పేర్కొన్నారు. దీనికి సీజేఐ జస్టిస్ డి.వై చంద్రచూడ్ స్పందిస్తూ.. మీరు విద్యావంతులు. ముందు మంచి ఉద్యోగం సంపాదించండి. ఈ కేసులో మీరు 10 ఏళ్లయినా న్యాయపోరాటం చేయగలరేమో..! కానీ దానివల్ల కేవలం న్యాయవాదులకే ప్రయోజనం కలుగుతుంది. మీరెందుకు పరస్పర సమ్మతితో విడాకులు తీసుకునేందుకు అంగీకరించ కూడదు మీరు అందుకు అంగీకరిస్తే కేసును మూసేస్తాం. మీరు వైవాహిక బంధాన్ని తిరిగి కొనసాగించే పరిస్థితుల్లో లేరని స్పష్టమవుతోంది. మీరు నిరక్షరాస్యులైతే కేసు వేరేగా ఉండొచ్చు. కానీ మీరు చదువుకున్నవారు.. ఉద్యోగం సంపాదించగలరు అని ఆ మహిళకు సూచించారు.

## రైతులను రోడ్డుకీడ్చిన ఘనత బీజేపీది

### వీరు రైతుల గురించి మాట్లాడడమా

### బీజేపీ నేతల ధర్నాపై మండిపడ్డ తుమ్మల

**హైదరాబాద్, సెప్టెంబర్ 30(క్విక్ టుడే న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం వెయ్యి ఎలుకలు తిన్న పిల్లి.. కాశీకి పోయినట్లుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. రైతులను రాజధాని వీధులకు ఈడ్చిన ఘనత బిజెపిదన్నారు. రైతు చట్టాలతో ఎంతమంది ఉసురు తీసారో చెప్పగలరా అని ప్రశ్నించారు. చాలా మంది రైతులకు రుణమాఫీ జరగలేదని భాజపా నాయకులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన విడుదల చేశారు. 2022 కల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతుల ఆదాయం రెట్టింపు కాదు కదా.. గత పదేళ్లలో పెరిగిన ఖర్చులతో పోల్చుకుంటే నికర ఆదాయం పెరగని వాళ్లందరి సమాచారం మీ దగ్గర ఉందా? స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేసి.. రైతులను ఆదుకోవాలంటూ రాజధాని వీధుల్లోకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్న వారి విజ్ఞప్తులను ఎప్పుడైనా పట్టించుకున్నారా? భాజపా పాలిత రాష్ట్రాల్లో ఏ ఒక్క రాష్ట్రంలోనైనా రుణమాఫీ చేసి చూపించగలరా? రూ. లక్షల కోట్లు ఎగ్గొట్టిన పారిశ్రామికవేత్తల నుంచి నిధులు రికవరీ చేసి దేశవ్యాప్తంగా ఉన్న రైతుల రుణమాఫీ చేయగల నిబద్ధత మీకుందా? కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతులకు భరోసా కల్పించే బాధ్యత మాది. ఇప్పటికే సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాం. పంటలన్నింటినీ మద్దతు ధరకే కొనుగోలు చేసేందుకు ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని తుమ్మల పేర్కొన్నారు.

## తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత

### కాంగ్రెస్ కార్యకర్తల రాకతో ఘర్షణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 30(క్విక్ టుడే న్యూస్):** హైడ్రా కూల్చివేతల కారణంగా జరుగుతున్న రాజకీయంలో నేతల మధ్య రాజకీయ వాగ్వాదాలు శృతి మించి పోతున్నాయి. ఫలితంగా దాడులకు సైతం దిగితున్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్లో ఉన్న తెలంగాణ భవన్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తల రాకతో ఉద్రికత్త నెలకొంది. ఒక్క సారిగా వందల మంది రావడంతో పోలీసులు ఉలిక్కి పడ్డారు. విషయం తెలిసి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా రావడంతో.. తెలంగాణ భవన్ ఎదురట ఉద్రిక్తత ఏర్పడింది. బీఆర్ఎస్ సోషల్ మీడియాకు చెందిన వారు మంత్రి కొండు సురేఖపై నీచంగా కామెంట్లు పెట్టారని.. పోస్టులు పెట్టారని ఆరోపిస్తూ వరంగల్ నుంచి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు ఈ ముట్టడికి ప్రయత్నించినట్లుగా తెలుస్తోంది. కాంగ్రెస్ కార్యకర్తలను అదుపు చేయడానికి పోలీసులు సరైన సంఖ్యలో లేకపోవడంతో బీఆర్ఎస్ కార్యకర్తలే వారితో వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ ఆందోళనల్లో మహిళా నేతలు,కార్యకర్తలు ఉండటంతో పరిస్తితి ఎటు వైపు వెళ్తుందోనని కంగారు పడ్డారు. ఈ వివాదం కారణంగా అత్యంత బిజీగా ఉండే జూబ్లిహిల్స్ కేబీఆర్ పార్క్ రోడ్ లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు కాసేపటికి అందర్నీ పంపించివేశారు. ఓ వైపు హైడ్రా విషయంలో హైకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో ఇలా తెలంగాణ భవన్‌పైకి కాంగ్రెస్ కార్యకర్తల్ని ఉసిగొల్పడం వెనుక రాజకీయ కుట్ర ఉందని బీఆర్ఎస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలతో పాటు ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం, టీ న్యూస్ చానల్ కార్యాలయం కూడా ఉంది. చానల్ ఆ భవనం నుంచి ప్రసారమవుతుంది. కాంగ్రెస్ కార్యకర్తలు తెలంగాణ భవన్ లోపలికి వరకూ వెళ్లి ఉంటే పెద్ద సమస్య అయ్యేదని అంచనా వేస్తున్నారు. కాసేపటికి పరిస్థితి సద్దుమణిగింది. ఇరవైపులా దాడుల వరకూ వెళ్లకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తెలంగాణ భవన్ మీదకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను చితకబాదామని రేవంత్ రెడ్డికీ అదే పరిస్థితి వస్తుందని బీఆర్ఎస్ హెచ్చరించింది.

# కేసీఆర్ బాటలోనే కాంగ్రెస్ మోసం

### పదేళ్లపాటు రైతులను చీటింగ్ చేసిన బీఆర్ఎస్

### ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంది కూడా అదే బాట

### బీజేపీ రైతు దీక్షలో ఎంపీ రఘునందన్ రావు

**హైదరాబాద్, సెప్టెంబర్30 (క్విక్ టుడే న్యూస్):** కేసీఆర్ పదేళ్ల పాటు చాలా హామిలు ఇచ్చి రైతులను మోసం చేశారని.. దీంతో ఎందరో అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. చనిపోయిన రైతు కుటుంబాలను కనీసం పరామర్శించని బీఆర్ఎస్ నేతలు ఇవ్వాళ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఏనాడు భూసార పరీక్షలు చేయలేదని చెప్పారు. నాడు బీఆర్ఎస్ నేడు కాంగ్రెస్ అదే విధానాన్ని అవలంభిస్తున్నాయని ధ్వజమెత్తారు. సోమవారంఇందిరా పార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రైతు దీక్ష జరిగింది. ఈ దీక్షలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ... రైతు సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని



ధ్వజమెత్తారు. పంట నష్టపోతే ఆదుకునేందుకు ఫసల్ బీమాను కేంద్రం తీసుకువస్తే.. కేసీఆర్ ఎందుకు తెలంగాణలో అమలు చేయనివ్వ లేదని ప్రశ్నించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఎంత అపఖ్యాతి మూటగట్టుకుందో.. 10 నెలల్లో కాంగ్రెస్ అంత మూట గట్టుకుందని విమర్శించారు. కేసీఆర్.. ఫామ్ హౌస్‌ను జాతికి అంకితం చేస్తావా? ఏం చేస్తావో తెలియదని అన్నారు. రైతులకు న్యాయం చేయాలని అన్నారు. కేసీఆర్ అవినీతి లక్ష కోట్లను సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి కక్కిస్తామని హెచ్చరించారు. నాడు పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్.. సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారని.. కానీ ఇప్పుడు సిట్టింగ్ జడ్జి దొరకలేదా? రిటైర్ అయిన జడ్జితో సిట్ వేశారని ఎద్దేవా చేశారు. రేవంత్ మూసీ సుందరీకరణ పేరిట కొత్త డ్రామా మొదలు పెట్టారని విమర్శించారు. తెలంగాణలో రైతుల సమస్యలు తీర్చడం బీజేపీకే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ ఒక 420 అనే విషయం అందరికీ తెలుసునని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శలు చేశారు.

# మూసీ ప్రక్షాళన పెద్ద కుంభకోణం

### లక్షన్నర కోట్లు పెట్టి ఏం సాధిస్తారు?

### ఇళ్లు ఇస్తామని.. ఇప్పుడు కూలుస్తారా

### మూసీలో పట్టాలు ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ

### నమామి గంగే ప్రాజెక్టుకే 40వేల కోట్లు

### సీఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కేటీఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 30(క్విక్ టుడే న్యూస్):** మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆరోపించారు. లక్షన్నర కోట్లు కర్చు పెట్టి ఎవరిని ఉద్దరిస్తారని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎంని ప్రశ్నిస్తున్నా. మేం మొత్తం దేశంలో ఉండే అన్ని ప్రాజెక్టుల వివరాలు తెప్పించాం. నామామీ గంగే డీపీఆర్, ప్రాజెక్ట్ వివరాలు.. ప్రాజెక్టు పూర్వపరాలు తెప్పించాం. నమామీ గంగే ప్రాజెక్టుపై ఆసక్తితో వివరాలు తెప్పించాను. 2400 కిలోమీటర్ల గంగానది ప్రక్షాళన కోసం కేంద్రం ఈ



ప్రాజెక్ట్ స్టార్ట్ చేసింది. ఈ ప్రాజెక్టుకు పెట్టిన బడ్జెట్ రూ.40వేలకోట్లు. 2400 కిలోమీటర్ల గంగా నదికి రూ.40వేలుకోట్లు. 50 కిలోమీటర్ల మూసీ సుందరీకరణ కోసం ఈ ముఖ్యమంత్రి రూ.1.50లక్షలకోట్ల ఖర్చు అవుతుందని సీఎం చెబుతున్నారు. దీన్ని స్కామ్ అనక ఏమనాలి. దీనివెనుక ఉన్న మతలబు ఏంటీ? చెప్పాలి కదా. అనుమతులు ఇచ్చిన ఇండ్లను కూల్చడమంటే ప్రభుత్వానికి తన వ్యవస్థ మీద, తన యంత్రాంగం, పరిపాలనపై తనకే పట్టులేనితనానికి నిదర్శనం కాదా? అని అడుగుతున్నానన్నారు. మున్సిపల్ మంత్రిగా నేను ఎనిమిదేళ్లు పని చేశాను. కూల్చాల్సి వస్తే.. మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ ఆఫీస్‌ను. కమిషనర్ ఎక్కడ కుసున్నడో.. బుద్ధ భవన్ నాలామీదున్న ఉన్నది. దాంట్లోనే ఎలక్షన్ కమిషనర్ ఉన్నడు. హైడ్రా కమిషనర్ ఉన్నరు. అందులో ఉమెన్స్ కమిషన్ ఉన్నది. మొదట ఆ భవనం కూల్చాలి. రెండోది ఏ జీహెచ్ఎంసీ పర్మిషన్‌లు ఇస్తదో.. ఆ జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని కూల్చాలి. జీహెచ్ఎంసీ ఆఫీస్ కూడా నాలాపైనే ఉన్నది. మరి ఇతరులకు సుద్దులు చెప్పే ముందు ఇక్కడి నుంచే మొదలిపెట్టాలి. నాకు తెలిసి సీఎంకి అవకాశం ఇస్తే.. కొత్తగా కట్టుకున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం కూలుస్తడు. ఆయనో లక్ష్యం పెట్టుకున్నడు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా పెట్టుకున్నడు. సెక్రటేరియట్ చూడంగనే అందరికీ కేసీఆర్ గుర్తుకు వస్తడు. మొన్న గణపతి బొప్ప మోరియా అనుకుంటా వెళ్లారు. అక్కడికి రాంగనే కేసీఆర్ గుర్తుకు వచ్చిండు.. కేసీఆర్ పాటలు పెట్టంగనే ముఖ్యమంత్రికి ఇరిటేషన్ వస్తున్నది. మూసీ బాధితుల ఆక్రందనలు చేస్తున్నా.. ఇబ్బంది పడుతుంటే.. నిన్న మొన్నటి వరకు డైలాగ్‌లు కొట్టిన మీ అధినాయకులు ఎక్కడా? మీ రాహుల్ గాంధీ యేడీ? మీ ప్రియాంక గాంధీ ఎక్కడ? అని ప్రశ్నించారు.

# దసరాకు ఊరెళ్తున్నారా.. అయితే జాగ్రత్త

### నగలు, నగదు జాగ్రత్త చేసుకోవాలి

### భద్రతా చర్యలు సూచించిన సైబరాబాద్ పోలీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 30(క్విక్ టుడే న్యూస్):** దసరా పండగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లేవారికి సైబరాబాద్ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. పండగ వేళ ఊరెళ్తే తప్పకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇంట్లో ఎవరూ లేకుండా వెళ్లిపోతే సొమ్మును జాగ్రత్త చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాధారణ రోజుల కంటే ఇలాంటి సందర్భాల్లో అధికంగా దొంగతనాలు జరుగుతాయని తెలిపారు. దొంగలు నిఘా పెట్టి నగదు, బంగారు నగలు ఎత్తుకెళ్తారని హెచ్చరించారు. ఇంటికి తాళాలు వేసి ఊరు వెళ్లాల్సి వస్తే తగిన ఏర్పాట్లు చేసుకున్న తర్వాతే వెళ్లాలని చెప్పారు. లేదంటే తిరిగి వచ్చే లోపు దోపిడీకి గురయ్యే అవకాశం ఉందని, విలువైన వస్తువులు ఉంటాయో లేదో గ్యారెంటీ ఉండదని చెప్పారు. 'దసరా పండగ సెలవులకు ఊరు వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు. లేదంటే ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలి. సెలవుల్లో బయటకు వెళ్తున్నప్పుడు సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్ ఏర్పాటు చేసుకోవడం మంచిది. మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉన్న తాళాలు అమర్చుకోవడం ఉత్తమం. తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. లేకుంటే డయల్ 100కు ఫోన్ చేయాలి. ఎ ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో చూసుకుంటూ ఉండాలి. మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్తా చెదారం, వార్తా పత్రికలు, పాలప్యాకెట్లు లేకుండా చూసుకోవాలి. ఎందుకంటే అవి ఉంటే మీరు ఇంట్లో లేరనే సమాచారం దొంగలకు తెలిసిపోతుంది. ఇంటికి వచ్చే,



వెళ్లేదారులు, ఇంటి లోపల సీసీ కెమెరాలు అమర్చుకుని డీవీఆర్ కనపడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశంలో పెట్టుకోవాలి. అల్మరా, కబోర్డ్స్‌కు సంబంధించిన తాళాలు కామన్ ఏరియాలైన చెప్పుల స్టాండ్, పరుపులు, దిండ్ల కింద, అల్మరాపైన, డ్రెస్సింగ్ టేబుల్‌లో ఉంచకుండా సీక్రెట్ ఏరియాలో దాయాలి. బంగారు ఆభరణాలు వేసుకుని ఫంక్షన్లకు వెళ్లేటప్పుడు జాగ్రతలు తీసుకోవాలి. సోషల్ మీడియాలో మీరు బయటికి వెళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడం మంచిది కాదు. అలా చేస్తే ఇంట్లో లేరన్న విషయం తెలిసిపోయి దొంగలు పడే అవకాశం ఉంటుంది. కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలు నిర్వహించుకోవాలి. ఎవరిమీదైనా అనుమానం వస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 100, సైబరాబాద్ పోలీస్ కంట్రోల్ రూమ్ 9490617100 లేదా వాట్సాప్ నంబర్ 9490617444కు ఫోన్ చేయండి' అని పోలీసులు సూచించారు.

## కంటతడి పెట్టిన మంత్రి కొండా సురేఖ

### ట్రోలింగ్ పట్ల భావోద్వేగానికి గురైన మంత్రి

### కేటీఆర్ బట్టలు ఊడదీసి పరిగెత్తిస్తామని ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 30(క్విక్ టుడే న్యూస్):** మంత్రి కొండా సురేఖ కంటతడి పెట్టారు. తనపై ట్రోలింగ్ వ్యవహారంపై సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఆమె తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. పలుమార్లు కంటతడి పెట్టారు. తనపై ట్రోలింగ్ పట్ల మంత్రి భావోద్వేగానికి గురయ్యారు. కేటీఆర్ ఖబడ్దార్ .. ఖబడ్దార్ కేసీఆర్ అని ఆమె హెచ్చరించారు. ఈ ట్రోలింగ్ వీడియోలను మీ చెల్లికి, తల్లికి చూపించు కేటీఆర్ అని అన్నారు. ఇకపై ట్రోలింగ్ చేస్తే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. అన్ని పార్టీల వాళ్లు తనను అక్కా అని, తన భర్తను బావ అని పిలుస్తారని ఆమె చెప్పారు. ఇంకోసారి ఇలా చేస్తే కేటీఆర్ బట్టలు ఊడదీసి పరిగెత్తిస్తామని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. రఘునందన్ కాల్ చేసి క్షమించమని అడిగాడని, అక్కా క్షమించు కాళ్లు మొక్కుతా అని రఘునందన్ అన్నాడని ప్రస్తావించారు. సిగ్గు లజ్జ ఉంటే బట్టలు లేకుండా తిరుగాలంటూ రఘునందన్‌ను విమర్శించారు. ఏదో ఒకరోజు ప్రజలు తిరగబడతారు. చేనేత కార్మికుల ఓట్లతో గెలిచి పద్మశాలి బిడ్డను ఇంత అవమనపరుస్తారా?. మానసిక వేదన కలిగించి కుటుంబాల్లో ఇబ్బంది పెడుతారా?. నాకు మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తుందనే కేసీఆర్ మహిళకు మంత్రిపదవి ఇవ్వలేదు. రెండవరసారి అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్‌లో భారీ మార్పులు వచ్చాయి. బీఆర్ఎస్ నాయకులు డబ్బు మదం ఎక్కి పిచ్చిగా ప్రవర్తిస్తున్నారు అని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ట్రోల్ చేస్తున్న ఫొటోల్లో తప్పు ఏముందో కేసీఆర్ భార్య శోభమ్మ చెప్పాలని మంత్రి కొండ సురేఖ అన్నారు. 'ఉన్నత వర్గం అనే బలుపు బీఆర్ఎస్‌కు ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సంబంధించిన మహిళలపై ఇలాంటి ట్రోలింగ్ చేస్తున్నారు. పనులు కావాలంటే నా దగ్గరికి రండి అని గత పాలకులు ఇబ్బంది పెట్టారు. హరీష్ డీపీ పెట్టుకొని ట్రోల్ చేస్తున్నారు. కేటీఆర్ హరీశ్ భేషరతుగా క్షమాపణ చెప్పాలి. డిస్కో డాన్సులు నేర్పిందే మీ చెల్లి. అమెరికా సంస్కృతి తెచ్చి బతుకమ్మకు అంటించింది మీ చెల్లి అంటూ మంత్రి ఘాటైన వ్యాఖ్యలు చేశారు.

### వాహనదారులకు

## మెట్రో యాజమాన్యం షాక్

### మెట్రో పార్కింగ్‌కు ఇక ఫీజు చెల్లించాల్సిందే

**హైదరాబాద్, సెప్టెంబర్ 30(క్విక్ టుడే న్యూస్):** ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో యాజమాన్యం షాక్ ఇచ్చింది. నాగోల్, మియాపూర్ స్టేషన్ల వద్ద వాహనాల ఉచిత పార్కింగ్ సౌకర్యాన్ని ఎత్తేస్తూ మరోసారి నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 6నుంచి నాగోల్, మియాపూర్ మెట్రో పార్కింగ్ వద్ద ఛార్జీలు వసూలు చేయనున్నట్లు యాజమాన్యం తెలిపింది. అయితే గతంలోనూ పార్కింగ్ ఫీజు వసూలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టగా.. ప్రయాణికుల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చింది. ఈ ఏడాది ఆగస్టు 14నుంచి ఛార్జీలు వసూలు చేస్తామని చెప్పడంతో పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. పలు రాజకీయ పార్టీలు సైతం ప్రయాణికులకు మద్దతు తెలిపాయి. నగరవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేయడం, మహా ధర్నాకు పిలుపునివ్వడంతో మెట్రో అధికారులు వెనక్కి తగ్గారు. తమ నిర్ణయాన్ని తాత్కాలికంగా వెనక్కి తీసుకున్నారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. అయితే తాజాగా మళ్లీ నాగోల్, మియాపూర్ స్టేషన్ల వద్ద పార్కింగ్ ఫీజు వసూలు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో మరోసారి వారి నిర్ణయంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. పెద్దఎత్తున దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఆగస్టు 14నుంచి మెట్రో స్టేషన్ల వద్ద వాహనాల పార్కింగ్ ఫీజు వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ప్రీపెయిడ్ పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే అదే రోజు ఉదయం నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద పార్కింగ్ చేసేందుకు వెళ్లిన ప్రయాణికులు బోర్డు చూసి అవాక్కయ్యారు. దీంతో అందరూ ఒక్కసారిగా నాగోల్ మెట్రో స్టేషన్‌లో ఆందోళనకు దిగారు. జూబ్లీహిల్స్, మాదాపూర్ ప్రాంతాల్లో ఉండలేక నాగోల్, ఎల్బీ నగర్ ప్రాంతాల్లో ఉంటున్నామని, మెట్రో కొత్త రూల్స్ దారుణమంటున్నారు.

హైదరాబాద్ సింది.